క్లుప్తంగా

నేడు పీసా గ్రామసభలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో మొత్తం 27 పంచాయతీలు ఉండగా, వాటిలో 26 పంచాయతీల్లో పీసా గ్రామసభలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. పీసా చట్టం అమల్లోకి వచ్చిన సందర్భంగా పంచాయతీల్లో సర్పంచ్, కార్యదర్శిల అధ్యక్షతన స్థానిక స్వపరిపాలనకు పునరుజ్జీవానికి, గిరిజనుల హక్కుల చట్టబద్ధతకు రక్షణ వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ సభలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

ఆర్థిక సాయం..



అపర్ణకు పది వేల రూపాయలు అందిస్తున్న ఉపాధ్యాయుడు దిలీప్‌కుమార్

పాలకొండ రూరల్: పట్టణంలోని నాగవంశపు వీధికి చెందిన ఆనాపు అపర్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయస్థితి నుంచి కోలుకున్నా కంటికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. అయితే ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అపర్ణ పరిస్థితి తెలుసుకున్న పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కుమిలి దిలీప్‌కుమార్ తన స్నేహితుల సహకారంతో రూ. పది వేలు సేకరించి సోమవారం బాధితురాలికి అందజేశారు. ఈయన వెంట వారణాశి లక్ష్మణరావు పాల్గొన్నారు.

27న విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ర్యాలీ

జియ్యమ్మవలస: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 27వ తేదీన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సోమవారం తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లి, ఏఈ లేదా డీఈని కలిసి వినతిపత్రం అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ వైఖరిపై నిరసన చేపట్టనున్నామన్నారు. అనంతరం చినమేరంగి గ్రామంలోని తన నివాసంలో కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

9 గ్రామాల్లో పెసా ఎన్నికలు ఏకగ్రీవం

సీతంపేట: ఏజెన్సీ పరిధిలోని గ్రామాల్లో పెసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ట్ ఏజెన్సీస్) ఎన్నికలు సోమవారం నిర్వహించారు. 13 గ్రామాలకు గాను 9 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా.. నాలుగుచోట్ల ఎన్నికలు నిర్వహించారు. కిల్లాడ, జయపురం, వజ్జాయిగూడ, కొత్తగూడ గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

కొమరాడ: మండలంలోని కూనేరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కరకవలస శ్రీరామ్మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు బాధిత కుటుంబ సభ్యులను సోమవారం కలిసి పరామర్శించారు. అధైర్య పడొద్దని పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, సర్పంచ్ కోలక తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, జియ్యమ్మవలస, చినమేరంగి, చినతుంబలి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సోమవారం కలిసి పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు లోలుగు నారాయణరావు, మరడాన కిశోర్, కోట రమేష్, అల్లు ఈశ్వరరావు, మఠ్రావు లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని పీపీ ఈతమానుగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రైతులు పండించిన పంటలు, రసాయన ఎరువుల వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, అసోసియేషన్ డైరెక్టర్ బి. సంజీవరావు, పాలక నాగేశ్వరరావు, గోపాలరావు, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

శీతాకాలం ఎఫెక్ట్..

ఉన్ని దుస్తులకు గిరాకీ



సీతంపేట సంతలో ఉన్ని వస్త్రాలు విక్రయిస్తున్న వ్యాపారులు

- భారీగా పెరిగిన చలి గాలులు
- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- స్వెట్టర్లు, రగ్గులకు డిమాండ్

సీతంపేట: చలి గాలులు ముమ్మరంగా వీస్తున్నాయి. ఏజెన్సీలో అయితే చలి తీవ్రత మరికాస్త ఎక్కువగా ఉంది. దీంతో ఉన్ని దుస్తులకు గిరాకీ నెలకొంది. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఎక్కువ మంది వారపు సంతల్లో స్వెట్టర్లు, రగ్గులు కొనుగోలు చేస్తున్నారు. రాజస్థాన్, ఒడిశాకు చెందిన వ్యాపారులు ఉన్ని దుస్తులను సంతల్లో విక్రయిస్తున్నారు. పట్టణాల్లో ప్రత్యేకషాపుల్లో ఆరుబయట వీటిని ప్రదర్శించి విక్రయిస్తున్నారు. సీతంపేట ఏజెన్సీలో అయితే గ్రామాల్లో జరిగే వారపు సంతల్లో ఉన్ని దుస్తుల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు ముంబై, కోల్‌కతా, తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులను కొనుగోలు చేసి ఏజెన్సీలో విక్రయిస్తున్నారు. స్వెట్టర్లు, రగ్గులు నాణ్యతను బట్టి రూ. 200 నుంచి 800 రూపాయల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి. నెల రోజుల కిందట నుంచి విక్రయాలు ప్రారంభం కాగా.. ప్రస్తుతం వ్యాపారం జోరందుకుంది. మార్కెట్లోని ప్రధాన షాపుల్లో వెయ్యి రూపాయలు పలికిన స్వెట్టర్, రగ్గులు.. పుట్‌పాత్, సంతల్లో 300 రూపాయల్లోపే లభిస్తుండడంతో ప్రజలు ఎక్కువ మంది కొనుగోలుకు ముందుకు వస్తున్నారు.



ఉన్ని దుస్తులు కొనుగోలు చేసుకుంటున్న గిరిజనులు

వ్యాపారం బాగుంది..



ఏజెన్సీలో వ్యాపారం బాగుంది. మేమంతా గ్రామాలకు వెళ్లి నేరుగా విక్రయిస్తాం. అలాగే వారపు సంతల్లో సైతం అమ్మకాలు చేపడతాం. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం విక్రయాలు బాగున్నాయి. రోజుకు రూ.15 వేలకు పైగానే వ్యాపారం జరుగుతోంది. ఈ సీజన్‌లోనే ప్రతి ఏడాదీ ఏజెన్సీకి వచ్చి విక్రయాలు చేపడతాం. – పాత్రో, వ్యాపారి, పర్లాఖిమిడి

చలి నుంచి రక్షణ..



వ్యాపారుల వద్ద కనుగోలు చేసిన వివిధ రకాల ఉన్ని వస్తువులతో చలి నుంచి ఉపశమనం కలుగుతోంది. పిల్లలు, పెద్దలందరికీ ఈ స్వెట్టర్లు ఉపయోగపడుతున్నాయి. వాతావరణంలో మార్పులు ఉండడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో అన్ని చోట్లా ఉన్ని దుస్తులు లభిస్తున్నాయి. – ఎస్.అడ్డాయి, బిజీగూడ

పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు..

పగటిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి ఎక్కువగా ఉంది. సాయంత్రం 5 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఉదయం 8 గంటలైనా చలి తగ్గకపోవడం, మంచు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9 గంటల వరకు కూడా గ్రామాల్లో చలిమంటలు వేస్తున్నారంటే చలి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

విద్యార్థుల భద్రత అధికారులకు పట్టదా?

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల భద్రత ప్రభుత్వ అధికారులకు పట్టదా అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు ప్రశ్నించారు. మండలంలోని కోసంగిభద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేదని, ఏవైనా విషపూరిత సర్పాలు వసతిగృహంలోకి వచ్చి జరగరాని ఘోరం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. విద్యార్థుల అనారోగ్యం బారినపడితే కనీసం చూసుకునేందుకు ఆరోగ్యకర్త కూడా లేరని, ప్రతీ వసతిగృహంలో ఆరోగ్యకర్త అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు

వసతిగృహాల్లో సిక్‌రూమ్ తప్పనిసరి

కొమరాడ: విద్యార్థుల వసతిగృహాల్లో సిక్‌రూమ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలని, దోమల బారినపడకుండా దోమతెరలు వాడాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. జర్వం లక్షణాలు కనిపిస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు.



బాలికల వసతిగృహాన్ని సందర్శిస్తున్న మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

20 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

గరుగుబిల్లి:

మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏవో ఆర్.విజయభారతి సోమవారం తెలిపారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. ధాన్యం తీసుకున్న 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతోందన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు.

అపార్ నమోదు వేగవంతానికి చర్యలు

గరుగుబిల్లి: విద్యార్థులకు సంబంధించి, అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి, ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన వారు.. మాట్లాడుతూ ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ, పేర్లలో నెలకొన్న తప్పుల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి ప్రతీ మండల కేంద్రానికి ఆధార్ నమోదు కేంద్రం మంజూరు చేయడం జరిగిందన్నారు.

ఏనుగుల సంచారంతో రైతుల ఆందోళన

గరుగుబిల్లి: మండలంలో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని సుంకి గ్రామంలో కళ్లాల్లో ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, పెనుగంటి గౌరునాయుడులు నూర్పిడికి సిద్ధం చేసిన వరి కుప్పలను ఏనుగులు చెల్లాచెదురు చేశాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఏనుగులు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగర పంచాయతీ చైర్మన్‌గా పల్లా..

పాలకొండ: నగర పంచాయతీ చైర్మన్‌గా పల్లా ప్రతాప్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన యందవ రాధాకుమారికి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. దీంతో కొద్ది రోజులుగా నగర పంచాయతీ చైర్మన్ కుర్చీ ఖాళీగా ఉంది. 2వ వైస్ చైర్మన్‌గా ఉన్న ప్రతాప్‌కు అదృష్టం వరించడంతో చైర్మన్ పదవి దక్కించుకున్నారు.

కంటి ఆస్పత్రికి పయనం



ఆస్పత్రికి పయనమైన రోగులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వాడపుట్టి, కొత్తవలస గ్రామాల్లోని వైద్య శిబిరాల్లో నేత్ర శస్త్రచికిత్సకు ఎంపికైన 43 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం కొత్తవలస నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి సోమవారం తరలించారు. ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడంతో పాటు భోజనం, వసతి, ప్రయాణ సదుపాయాలు కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్ల అనంతరం కళ్లద్దాలు, మందులు కూడా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అలాగే వారం రోజుల తర్వాత ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ చేయడం జరుగుతుందన్నారు.

స్త్రీ, పురుషులిద్దరూ సమానమే



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

గుమ్మలక్ష్మీపురం: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రచారంలో భాగంగా స్థానిక ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులకు స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనన్న భావనపై సోమవారం అవగాహన కల్పించారు. ఏ రంగంలోనూ పురుషులకు తక్కువ కాకుండా మహిళలు గొప్పగా రాణిస్తున్నారని, పురుషులతో సమాన గౌరవం స్త్రీలకు ఇవ్వాలని వక్తలు కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం–ఆరోగ్యం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మోడల్ మండల టీమ్ లీడ్ వై.గణేష్‌శరత్ చంద్ర, ప్రిన్సిపాల్ వీర్‌సింగ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హరి, ఆనంద్, నిఖిల్, నరసింహ, జి.నిర్మలాదేవి, కె.భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ప్రజా సమస్యల పరిష్కార వేదిక..!



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కొద్దిమంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం నిర్వహించగా.. మండల పరిషత్ కార్యాలయ సూపరింటిండెంట్‌తో పాటు ఎంఈఓ గౌరినాయుడు, హౌసింగ్ ఏఈ వినోద్, వెలుగు సీసీ ఆనందరావు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల వరకు మిగిలిన శాఖల అధికారులెవ్వరూ హాజరుకాలేదు. ఇదిలా ఉంటే ప్రజల నుంచి కూడా ఒక్క ఫిర్యాదు రాకపోవడం విశేషం. ఇటు ప్రజల నుంచి, అటు అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో ఇటువంటి కార్యక్రమాల వల్ల ఏం ఉపయోగమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ విక్రాంత్ జన్మదినం..



పుట్టినరోజు సంబరాల్లో ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పుట్టిన రోజు వేడుకలను పాలకొండలోని ఆయన స్వగృహంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. రాజకీయ నాయకులు, ఉద్యోగులు, అభిమానులు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో ఆయన స్వగృహంలో సందడి వాతావరణం నెలకొంది. వేడుకల్లో వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని, వంగర, రేగిడి, రాజాం, సంతకవిటి మండలాలకు చెందిన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొండచీపుర్లకు గిట్టుబాటు ధర కల్పించాలి

- గిరిజన జేఏసీ వినతి



వినతులు స్వీకరిస్తున్న జేసీ శోభిక, ఎమ్మెల్యే జయకృష్ణ, తదితరులు

సీతంపేట: కొండచీపుర్లకు గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఐటీడీఏఓ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ శోభిక, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, జీసీసీ కొండచీపుర్లను కొనుగోలు చేయడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారపు సంతల్లో విక్రయించాల్సి వస్తోందని చెప్పారు. మద్దతు ధర కల్పించి, జీసీసీ ద్వారా కొండచీపుర్లు కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం అధికారులు పలువురి నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 108 వినతులు అందాయని జేసీ తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఏపీఓ చిన్నబాబు, డీఈ సింహాచలం, డీడీ అన్నదొర, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు, సీడీపీఓ రంగలక్ష్మి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

● ముగిసిన సప్తాహం....



పాలకొండలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన భాగవత సప్తాహం కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుడు అంజిబాబు నేతృత్వంలో ఆధ్యాత్మిక వక్తలైన అరటికట్ల కామేశ్వరరావు, దాసిరెడ్డి యోగీశ్వరరావు, బౌరోతు శంకరరావు, జగన్‌మోహనరావు, భాస్కరరావు, సత్యనారాయణలను సత్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రచారకులు ఎన్‌వీ రమణ, రచయిత జడ్డు జగ్గారావు, పాడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

● డీలర్ పోస్టులకు పరీక్ష



పాలకొండ డివిజన్‌కు సంబంధించి 21 రేషన్ డిపోల్లో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులకు సోమవారం రాత పరీక్ష నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన రాత పరీక్షను సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాత పరీక్ష అనంతరం అర్హులైన వారికి డీలర్ పోస్టులు కేటాయిస్తామని చెప్పారు. ఎటువంటి పైరవీలకు తావులేదని స్పష్టం చేశారు. – పాలకొండ

● క్షీణించిన పారిశుధ్యం..



పాలకొండ పట్టణంలోని పెద్దకాపు వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో ఈగలు, దోమల ఉధృతి పెరగడంతో పాటు దుర్గంధం వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి అంటురోగాలు ప్రబలుతాయోనని మేదరవీధి, కోమటిపేట కూడలి, కొత్తవీధి, గేదెలవారి వీధి కూడలి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. – పాలకొండ రూరల్

ఆందోళనలో అన్నదాత..

వీరఘట్టం/పాలకొండ రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. నాలుగు రోజుల అనంతరం ఒక్కరోజు వర్షం కురవకపోవడంతో రైతులకు ఊరట లభించింది. అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వాతావరణం కాస్త అనుకూలంగా ఉన్నా ఎక్కడ చినుకులు పడతాయోనని ఇంకా ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పి ఉంచారు. తడిచిన ధాన్యం రంగుమారే అవకాశం ఉన్నందున కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు.



పాలకొండ రూరల్: వర్ష ప్రభావం నుంచి ధాన్యం తడిసిపోకుండా గడ్డి కప్పిన రైతులు

సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు

భామిని: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జేసీ ఎస్. శోభిక ఆదేశించారు. మండలంలోని ఘనసర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇంతవరకు 8, 500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఎంఏఓ కె.సింహాచలం వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలాపు అప్పారావు, వ్యవసాయ సహాయకులు ఎలీసా, జ్యోతి, భవానీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవ భక్తుల కొవ్వొత్తుల ర్యాలీ



వీరఘట్టం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండల కేంద్రంలోని బీసీ కాలనీ, రెల్లివీధి, చర్చివీధి, కస్పావీధికి చెందిన క్రైస్తవ భక్తులు సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ర్యాలీలో వీరఘట్టం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఏసుదాసు, కోమటపల్లి విజయకుమార్, బొమ్మాళి బాబూరావు, జలుమూరు అమర్‌నాథ్, దేవుపల్లి ముద్దు, శనపతి చిన్న, సిరిపురం ఎర్రయ్య, బండి రాజు, రాయిపల్లి రత్నాకర్, జలుమూరు రాములతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.